# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి.**

**2. శివరాత్రి పండుగను పురస్కరించుకుని దేశప్రజలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు.**

**3. ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

**4. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 2025- 26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.**

**5. వైఎస్ఆర్ జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన రెండో రోజు కొనసాగుతోంది.**

==========================

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం, ప్రముఖ వాయులింగక్షేత్రం శ్రీకాళహస్తి, అమరావతిలోని అమర లింగేశ్వర స్వామి ఆలయాలు, పంచారామ క్షేత్రాలైన కోనసిమ జిల్లా ద్రాక్షారామం, కాకినాడ జిల్లా కుమార రామం, పశ్చిమగోదావరి జిల్లాలోని క్షీరారామం, బీమారామం, పల్నాడు జిల్లాలోని అమరా రామం శైవ క్షేత్రాలను ఈ తెల్లవారుజామునుంచే భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నంద్యాల జిల్లాలోని శ్రీశైలం ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నది. మహా శివరాత్రి సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శివభక్తులు పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రధాన అర్చకులు పూర్ణానంద స్వామి మాట్లాడుతూ …

వాయిస్….20 సెకన్లు….

-------------------------

మహా శివరాత్రి సందర్భంగా దేశప్రజలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మహాదేవుడి ఆశీర్వాదం అందరికీ లభించాలని కోరుతూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. దేవాది దేవుడైన మహాదేవుడు భక్తులకు ఆశీస్సులు ప్రసాదించాలని, మన దేశం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పర్వదినం ప్రజలకు సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం కలిగించాలని, దేశం మరింత బలపడాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

---------------------------

ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో విద్యుత్ కొనుగోళ్లు, పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండు తగ్గ ఉత్పత్తితో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని 60శాతం మేర తగ్గించినట్లు వివరించారు. కాగా, రిలయన్స్ సంస్థలు ఏర్పాటు చేయనున్న 500 కం ప్రెస్డ్ బయోగ్యాస్-సీబీజీ కేంద్రాల నిర్మాణానికి సంబంధించి మంత్రి గొట్టిపాటితో రిలయన్స్ ప్రతినిధులు సచివాలయంలో నిన్న సమావేశమయ్యారు. ఈ ప్లాంట్లకు 65 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టేందుకు రిలయన్స్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని చెప్పారు. ప్లాంట్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇంధనశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 2025- 26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో ప్రధానంగా మహిళలు, యువత, పెట్టుబడులు, వ్యవసాయంపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. రానున్న ఐదేళ్లలో పేదలకు 3 కోట్ల ఇళ్లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని ఆమె పేర్కొంటూ,

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

వైఎస్ఆర్ జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన రెండో రోజు కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఈరోజు పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి కంటి ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. అనంతరం.. ఆయన ఆస్పత్రిలో ఏర్పాట్లను పరిశీలించి కంటి పరీక్షలు చేయించుకున్నారు.

---------------------------

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో రేపు జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జిల్లాలో 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో 42 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. మొత్తం 63 వేల 144 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలుకు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేస్తూ...

...వాయిస్... 32 సెకన్లు

---------------------------

తూర్పు గోదావరి జిల్లా తాడిపూడిలో గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురు మృతిచెందగా.. మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. మహా శివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల శాఖ అధ్వర్యంలోని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర సంస్కృతి మార్పిడి కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయంలో నిన్న ఒరిస్సాలోని 5 జిల్లాల నుండి వచ్చిన 25 మంది యువత పాల్గొన్నారు. నెహ్రూయువ కేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకులు అన్సుమన్ ప్రసాద్ దాస్ ఈ సందర్భంగా ఆకాశవాణితో ప్రత్యేకంగా మాట్లాడుతూ..

..వాయిస్.. 24 సెకన్లు

---------------------------

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్–సీబీఎస్ఈ విధానంలో 10వ తరగతి చదివే విద్యార్థులు వచ్చే ఏడాది నుంచి బోర్డు పరీక్షలను ఏడాదిలో రెండుసార్లు రాసే అవకాశాన్ని పొందనున్నారు. ఇందులో మొదటి దఫా పరీక్షలు ఫిబ్రవరిలోను, రెండో విడతలో మేలో జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలకు సీబీఎస్ఈ నిన్న ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన పబ్లిక్ నోటీస్‌ను సీబీఎస్ఈ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. దీనిపై ప్రజల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను మార్చి 9వ తేదీ వరకూ స్వీకరించనుంది. తదుపరి దానికి ఆమోద ముద్ర వేయనుంది.

---------------------------

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా ఈరోజు ముగియనుంది. మహా శివరాత్రి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం, ఇతర ఘాట్లలో ఈ ఉదయం నుండి భక్తులు పవిత్ర స్నానాలు చేస్తున్నారు. భక్తుల రద్దీ నెలకొనడంతో అధికారులు కుంభమేళా ప్రాంతంలో "నో వెహికల్ జోన్"ని అమలు చేశారు. మహా శివరాత్రి పవిత్ర స్నానాల తర్వాత భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని అదనపు రైళ్లను నడపడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళాలో ఇప్పటివరకు 64 కోట్లకు పైగా మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

=====================